

సంసారంలో సరిగమలు - తమస్విని



(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..

కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,

కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..

వెరసి సంసారంలో సరిగమలు..!)

ప్రస్థానం

కాలింగ్ బెల్ శబ్దం విని సుమిత్ర టి.విని పాజ్‌లో పెట్టి వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా విమల.

"హాయ్ విమ్మీ..రా..రా"

స్నేహితురాల్ని ప్రేమగా ఆలింగనం చేసుకుంది.

"ఎలా ఉన్నావు సుమిత్రా" విమల చెప్పులు విప్పుతూ ఆప్యాయంగా అడిగింది.

"బానే ఉన్నాను. నెమ్మదిగా అలవాటు పడుతున్నాను. తప్పదుగా" సుమిత్ర విషాదంగా చెప్పింది.

"నెలనించి రావాలని. ఎక్కడ? ఇంట్లో క్షణం తీరికలేదు. ఇవాళ ఎలాగైనా నిన్ను కలవాలని అన్నీ వదిలేసి వచ్చాను. మహీధర్ నువ్వు ఎలా ఉండేవాళ్ళో నాకు తెలుసు. డెబ్బై అంటే ఈ రోజుల్లో చిన్న వయసే. అలా సడన్‌గా పోవడం నీకు ఎంత షాకో నాకు తెలుసు. తేరుకున్నావా?" విమల మంచినీళ్ళ గ్లాస్ అందుకుంటూ అడిగింది.

"పర్లేదు. నిజానికి నేను ఊహించిన దానికన్నా త్వరగానే తేరుకున్నాను. నువ్వెలా ఉన్నావు? అంతా బాగున్నారా?" సుమిత్ర అడిగింది.

విమల వంటగదిలోకి వెళ్ళి తను తెచ్చిన కూరగాయలు, పళ్ళు ఫ్రిజ్‌లో సర్ది వంటగదిని ఓసారి చూసి వచ్చి అడిగింది.

"పొయ్యిలో పిల్లి లేచినట్లు లేదు? అసలు ఏమైనా తింటున్నావా? పాత సినిమా డైలాగ్ చెప్పనా? పోయిన వాళ్ళతో మనమూ పోలేము కదమ్మా?"

సుమిత్ర నవ్వింది.

"శుభ్రంగా తింటున్నా. ఇవాళ వండుకోడానికి బద్ధకమేసి పిజ్జా ఆర్డర్ చేసి తిన్నా. నిజానికి మహీ పోయాడు అన్న బాధ కంటే, నా భవిష్యత్తు గురించిన బాధే ఎక్కువగా ఉంది విమలా."

"భవిష్యత్తా? అదేంటి? నీకు రెండు పెన్షన్స్ వస్తాయి. స్వంత ఇల్లు ఉంది. ఆరోగ్యంగా ఉన్నావు. పిల్లలు బంగారు కొండలు."

"అదే నా బాధ. నా పిల్లల అతి మంచితనం నాకు ఇబ్బందిగా ఉంది విమలా" సుమిత్ర భారంగా చెప్పింది.

"నాకు అర్థంకాలేదు. నాతో చెప్పచ్చా?" విమల సందిగ్ధంగా అడిగింది.

"బాల్య స్నేహితురాలివి. నీకు కాక ఎవరికి చెప్తాను.. పిల్లలు నన్ను 'నా దగ్గర ఉండు', అంటే'నా దగ్గరుండు' అని చంపుతున్నారు విమలా."

"మంచిదేగా? చాలామంది పిల్లలు పేరెంట్స్ బాధ్యత తీసుకోడానికి ఇష్టపడడంలేదు. నీ పిల్లలు ఆనందంగా ఆహ్వానిస్తుంటే నీకేంటి ఇబ్బంది?" విమల విస్మయంగా అడిగింది.

"నీకు అర్థం కావడంలేదు. వాళ్ళ దగ్గర ఉండడం నాకు యిబ్బందే విమలా. మహీధర పోయి మూడు నెలలైంది. నేను అంతకు ముందు ఉన్నట్లుగానే ఉన్నాను. అదే ఆరోగ్యంతో. ఇప్పుడు కొత్తగా వాళ్ళు 'నువ్వు ఒక్కదానివే ఉండద్దు. మా ఇంటికి రా' అంటున్నారు. నాకది ఇష్టంలేదు."

"ఎందుకని?"

"నా స్వేచ్ఛ నాకుండదు విమలా. కిందటి నెల ఇద్దరి ఇళ్ళల్లో పదిహేను రోజుల చొప్పున ఉండి వచ్చాను. అబ్బాయి ఇంట్లో కోడలు ఉద్యోగం చేయదు. వాడు ఆఫీస్‌కి వెళ్ళగానే ఆ అమ్మాయి ఫ్రెండ్స్ ఇళ్ళకో, పుట్టింటికో, షాపింగ్‌కో వెళ్ళిపోతుంది. సాయంత్రం పిల్లలు వచ్చే టైమ్ కి వచ్చేస్తుంది. 'మా అమ్మని కూడా నీతో తీసుకెళ్ళు' అంటాడు మావాడు. అది మా ఇద్దరికీ ఇష్టంలేదు. తప్పక నాకోసం రెండు రోజులు ఇంట్లో ఉన్న కోడలు విలవిల్లాడిపోయింది. 'నేను ఒక్కదాన్నే ఉంటానులే నువ్వు వెళ్ళు' అంటే, 'మీ అబ్బాయికి కోపం వస్తుంది' అంటుంది.

నా వల్ల ఒకరు ఇబ్బంది పడడం నాకు ఇష్టంలేదు విమలా. వాడో మూర్ఖుడు. నన్నేదో గౌరవిస్తున్నాను, ప్రేమిస్తున్నాను అనుకుంటాడు. నేను కోడలితో కిట్టీ పార్టీకి, వాళ్ళ పుట్టింటికి వెళ్ళి ఏం చేస్తాను చెప్పు. అర్థం చేసుకోడు. కోడలికి, నాకు ఇష్యూస్ లేవు. వీడివల్ల వస్తాయేమోనని నాకు భయం."

"నిజమే. మగపిల్లలకి కొన్ని సున్నితమైన విషయాలు అర్థంకావు. బేబీతో ఏంటి సమస్య?" విమల అడిగింది.

సుమిత్ర దీర్ఘంగా నిట్టూర్చింది.

"అక్కడ వాళ్ళ అత్తగారు ఉంటారు. ఆవిడకి, నాకు ఒక్క అభిరుచికూడా కలవదు."

"ఆవిడకి నువ్వు అక్కడ ఉండటం ఇష్టం లేదా?"

"అదేం లేదు. ఆవిడ పట్టించుకోదు. నాకే ఇబ్బంది."

విమల ప్రశ్నార్థకంగా చూసింది.

"మన కాలానికి నేను బాగా చదువుకున్నాను. స్టేట్ గవర్నమెంట్‌లో పెద్ద ఉద్యోగం చేసాను. ఆడవాళ్ళు, హక్కులు అని నీలాంటి వాళ్ళకి ఉపన్యాసాలు చెప్పాను. కాని నిజానికి నేను సగటు మనిషిని. మా అమ్మాయి అత్తగారితో కలిసి ఉండడం నాకు కంఫర్ట్‌బుల్‌గా లేదు. అందుకే వచ్చేసాను."

"ఉత్తమం. నీ ఇంట్లో నువ్వు ఉంటే సమస్యేమిటి?"

"అదేకదా. ఈ పిల్లలు మా ఇంటికి రా, అంటే మా ఇంటికి రా అని చంపుతున్నారు. నీకు తెలుసుకదా. నాకు మహీకి సినిమాలంటే పిచ్చి. ప్రతి శుక్రవారం రాత్రి సెకండ్ షోకి వెళ్ళేవాళ్ళం. పండగలకి రెండు మూడు సినిమాలు రిలీజైతే వరసగా రెండు మూడు రోజులు వెళ్ళి చూసేవాళ్ళం. టివిలు వచ్చాక ఇంట్లోనే రోజూ చూసేవాళ్ళం. ఓటిటిలు వచ్చాక సబ్‌టైటిల్స్ ఉంటాయి కాబట్టి ఏ భాష సినిమాలైనా ఆనందంగా చూస్తాం. నాకో క్రమ శిక్షణ లేదు. రాత్రి ఒకటి, రెండు దాకా టి.వి చూసిపడుకుంటే, పొద్దున పది, పదకొండుకి లేస్తాను. వంట చేయడం బద్ధకంగా ఉంటే, ఆర్డర్ చేసుకుంటాను. ఒక్కోసారి బద్ధకంతో సాయంత్రందాకా స్నానం చేయను. పిల్లల ఇంట్లో ఉంటే, ఈ విశృంఖలత కుదరదు. నాకు నచ్చినట్లు నేను ఉండలేను. పెద్దవాళ్ళంటే ఇలాగే ఉండాలి అని మనకి కొన్ని నార్మ్స్ ఉన్నాయి. నేను వాటిలో ఇమడలేను. రోజూ పిల్లలిద్దర్నించి ఫోన్లు, మెసేజ్‌లు – ఎప్పుడు వస్తున్నావు?" సుమిత్ర విచారంగా చెప్పింది.

విమలకి ఏం చెప్పాలో తెలీలేదు.

"కొడుకు ఇంట్లో రాత్రి రెండుదాకా టి.వి చూడగలనా? అమ్మాయి అత్తగారు చూస్తుండగా బర్గర్ ఆర్డర్ చేసుకుని తినగలనా? మనకి ఎన్ని ఫాల్స్ ప్రెస్టేజ్‌లు? అధికారిగా ఎన్నో సమస్యలని పరిష్కరించాను. తల్లిగా పిల్లలు నొచ్చుకోకుండా ఈ సమస్యకి పరిష్కారాన్ని ఆలోచించాలి" సుమిత్ర నిట్టూర్చింది.

🦋🦋🦋

రెండు నెలల తర్వాత విమలకి ఫోన్ వచ్చింది.

"విమ్మీ సుమిత్రని. ఈ ఆదివారం వారణాసి వెళ్తున్నా."

"అవునా? ఎవరితో వెళ్తున్నావు? ఎన్ని రోజులు? అయోధ్య కూడా వెళ్తున్నావా?"

"నేనేం చిన్నపిల్లనా ఎవరితోనో వెళ్ళడానికి? నేనే వెళ్తున్నా. అక్కడే ఉంటున్నా. ఇప్పట్లో రాను."

"అదేంటి?" విమల ఆశ్చర్యపోయింది.

"అక్కడ డబుల్ బెడ్‌రూం ఫ్లాట్ కొనుక్కున్నాను. వెళ్ళిపోతున్నాను."

"పోన్లే. మాకు దూరంగా ఉన్నా దేవుడికి దగ్గరగా ఉంటావు. కాశీ బాగుంటుందిట. నువ్వు సెటిలయ్యాక వస్తాం" విమల చెప్పింది.

"నువ్వు ఊరు మారినప్పటినించి వద్దామని. ఇప్పటికి కుదిరింది. రైల్వే స్టేషన్‌లో స్నేహితురాలిని చూసి విమల ఆనందంగా చెప్పింది.

"నేను వచ్చి పదమూడు నెలలైంది" సుమిత్ర నవ్వింది.

సుమిత్ర ఇల్లు వివరంగా ఇద్దరు మనుషులకి సరిపోయే విధంగా ఉంది. 60 ఇంచెస్ టి.వి, దాని ముందు సోఫాలు, రెండు పడక గదుల్లో మంచాలు, కిచెన్‌లో ఉండాల్సిన వస్తువులు...

"అన్నీ చక్కగా అమర్చుకున్నావు. హైద్రాబాద్‌లో ఉన్నట్లే ఉంది. ఇబ్బందులేం లేవుగా?" విమల అడిగింది.

"వెదర్ కొంచెం ఇబ్బంది. అతి చలి, అతి వేడి, ఇంక వేరే సమస్యలేం లేవు. బ్రహ్మాండంగా ఉన్నా" సుమిత్ర టి.వి ఆన్‌చేస్తూ చెప్పింది.

"దర్శనానికి ఎప్పుడు వెళ్దాం? కాశీలో బోలెడన్ని గుళ్ళు ఉన్నాయటగా? రోజుకి రెండు చొప్పున చూసినా ఇంకా చాలా మిగులుతాయట. ముందు విశ్వేశ్వరుడిని చూసి తర్వాత విశాలాక్షి, తర్వాత అన్నపూర్ణమ్మలని చూద్దాం. రష్‌గా ఉంటుందా? ఇవాళ సాయంత్రం వెళ్ళొచ్చా?" విమల అడిగింది.

"ఏమో నాకేం తెలుసు?"

"అదేంటి ఏడాదినించి కాశీ క్షేత్రంలో ఉంటున్నావు. ఎప్పుడు రద్దీగా ఉంటుందో తెలీదా?"

"విమ్మీ ఒక విషయం చెప్తాను. మనసులోనే ఉంచుకో. నాకు అరవై ఐదేళ్ళు. ఆరోగ్యంగా ఉన్నాను. కొన్ని అభిరుచులతో, స్థిరమైన అభిప్రాయాలతో ఉన్నాను. కేవలం భర్త లేడన్న కారణంగా, జాలితో, సానుభూతితో, అది ఏమైనా కావచ్చు. నా స్వేచ్ఛని, స్వాతంత్రాన్ని హరించడం ప్రేమంటావా చెప్పు? మా పిల్లలు చెప్పే స్టాండర్డ్ డైలాగ్, 'అంతా ఏమనుకుంటారు? అమ్మని వంటరిగా వదిలేసిన స్వార్థపరులనుకోరా?' ఈ రోజుల్లో ఎవరి గురించి ఎవరు ఆలోచిస్తున్నారు? అనుకున్నా ఒకటి రెండుసార్లు అనుకుంటారు. ఎప్పుడూ మన గురించే ఆలోచించడానికి వాళ్ళకి ఇంకేం పని లేదా? కొందరు సున్నిత మనస్కులు ఉంటారు. వాళ్ళకి మనుషులు కావాలి. వంటరిగా ఉండలేరు. పిల్లలతో మనవలతో ఉండాలనుకుంటారు. అలాంటి వాళ్లని ఇంట్లో ఉంచుకోకపోతే పాపం కాని నాలాంటి స్వేచ్ఛాజీవి, వంటరి జీవితాన్ని ఇష్టపడేదాన్ని పంజరంలో బంధిస్తామంటే ఎలా? నాస్తికురాలినైన నాకు పరిష్కారాన్ని దేవుడే చూపించాడు. మా పక్కింటి భార్యాభర్తలు సత్యసాయి డివోటీలు. వాళ్ళు రిటైరవగానే పుట్టపత్రిలో చిన్న కాటేజ్ కొనుక్కుని వెళ్ళిపోయారు. అప్పుడు పిల్లలు భయపడే సమాజం వాళ్ళని తప్పుగా అనుకోదు కదా? అందుకే ఆలోచించి, వెతికి కాశీని ఎన్నుకున్నాను. విశ్వేశ్వరుడి సన్నిధిలో శేషజీవితం గడపడానికి అమ్మ వెళ్తుంటే, పిల్లల్ని ఇంక ఎవరు 'అనుకుంటారు?' మంచి రీజన్ కదా.

మనకి దూరమని, కాస్టాఫ్ లివింగ్ నేను భరించగలనని ఇక్కడికి వచ్చేసా. ఈ ఏడాదిలో నేను ఏ ఆలయాలకి వెళ్ళలేదు. మా నాన్న చదివిన బి హెచ్ యూ కి మాత్రం వెళ్ళి చూసాను. అంతే. అమ్మాయి అత్తగారు కాశీ చూడాలని చాలా ఆత్రుతగా ఉన్నారట. ఎప్పుడో వస్తారు. వాళ్ళతో మాత్రం గుళ్లకి వెళ్ళక తప్పదేమో" సుమిత్ర నవ్వింది.

"ఫాల్స్ ప్రెస్టేజెస్" విమల కూడా నవ్వింది.

(వచ్చే సంచికలో మరో సరిగమ)

Click here to share your comments